క్లుప్తంగా

నేడు 'ప్రజావాణి'

కోడేరు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు స్వచ్ఛతా భారత్ గ్రామీణ మిషన్‌పై అవగాహన

తెలకపల్లి: సోమవారం స్వచ్ఛతా భారత్ గ్రామీణ్ మిషన్ పేస్‌పై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చెన్నమ్మ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని దాసుపల్లి, రైతువేదికలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, వీఓఏలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. 27 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి స్వచ్ఛతా భారత్ గ్రామీణ మిషన్ పేజ్–2 పై శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కన్నారు. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనర్ డీఎల్‌పీఓ రామ్మోహన్‌రావు దేవేందర్, మౌనిక, ఊశన్నలతో మూడు రోజులు శిక్షణా కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు శిక్షణ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్‌లో జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ. 17 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులను ఆదివారం సర్పంచ్ కొత్త శిరీష, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రహదారిలో ఉన్న మిల్క్ సెంటర్ నుంచి చెన్నయ్యగడ్డ కాలనీలో సీసీ రోడ్లు వేయిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రాజనగరం రైతు సమితి అధ్యక్షులు పర్వతాలు, మల్లయ్య పాల్గొన్నారు.

1 నుంచి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

తెలకపల్లి: మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం రామాలయం ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని, మూడు రోజులు వివిధ కార్యక్రమాలతో పూజా కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరేటి వెంకన్న, మాజీమంత్రి కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులను ఆదుకోవాలని వినతి



కల్వకుర్తిరూరల్: వ్యవసాయ మార్కెట్‌లో రైతుల కష్టాన్ని వ్యాపారులు సిండికేట్‌గా మారి దోచుకుంటున్నారని, దోపిడీకి అడ్డుకట్ట వేసి రైతులను ఆదుకోవాలని వెల్దండ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన రైతు ఆలీ ఆదివారం వ్యవసాయ మార్కెట్ జిల్లా అధికారి బాలమణికి ఫిర్యాదు చేశారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో ఏజెంట్లు, ట్రేడర్లలో వ్యత్యాసం చూపుతున్నారని, పెద్దమొత్తంలో వేరుశనగ వస్తే నేరుగా డిగాడిగేటర్లకు తరలించి పన్ను ఎగవేస్తున్నారన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు తాగునీరు, నీడ కల్పించడం లేదని, కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు రెండు లైసెన్స్‌లు తీసుకున్నారని ఆరోపించారు.

అసంపూర్తిగా స్త్రీశక్తి భవన నిర్మాణం



తాడూరు: మండల కేంద్రంలోని కొత్త గ్రామ పంచాయతీ భవనాన్ని అనుసరించుకొని నిర్మాణ పనులు చేపట్టిన స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దశాబ్ద కాలం క్రితం రూ.18 లక్షలు మంజూరు కాగా ఈ నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరి కారణంగా పనులు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్న పనులను పూర్తి చేయాలనే ఆలోచన రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం సరిపోకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవం.. తెప్పోత్సవం



హంసవాహన తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్దండ: మండలంలోని గుండాల శ్రీ అంబారామ లింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం దేవాలయంలో వేదమంత్రోత్సవాలతో, డప్పువాయిద్యాలతో స్వామివారి హంసవాహన తెప్పోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు వృషభ వాహనసేవ తదితర క్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన కోనేరులో పుణ్యస్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిన్న జంగయ్యయాదవ్ సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మైసయ్య, ఈఓ ప్రసాద్, కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ, సురేష్‌శర్మ, నరహరిశర్మ, వీరేశంశర్మ, సంతోష్‌శర్మ, శివశర్మ తదితరులు ఉన్నారు.

బండలాగుడు పోటీల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

కొల్లాపూర్: ఈదమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా కొల్లాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన బండలాగుడు పోటీల ఏర్పాట్లను ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో ఈనెల 28 మార్చి 1వ తేదీన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. బండలాగుడు పోటీలు నిర్వహించే స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని రైతు సంఘాల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్ రెడ్డి, రాంచందర్‌యాదవ్, చంద్రశేఖరాచారి, బండల వెంకటస్వామి, రుక్మద్దీన్, కాటం జంబులయ్య, సాకలి నర్సింహ, బ్యాంగి లక్ష్మణ్, గిరి, అర్జున్ తదితరులున్నారు.

పురాతన ఆలయాలను అభివృద్ధి చేయాలి

మన్ననూర్: రాష్ట్రంతో పాటు నల్లమల పరిసర ప్రాంతాల్లో చరిత్ర కలిగిన పురాతన ఆలయాలకు మరమ్మత్తులు చేసి అభివృద్ధి చేయాలని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన అనేక ప్రముఖమైన ఆలయాల్లో భక్తుల నుంచి వస్తున్న ఆదాయంతో పురాతన ఆలయాలకు మరమ్మత్తులు చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని అన్నారు. చరిత్ర కలిగిన ఆలయాలు శిథిలావస్థలో ఉండటంతో గుప్త నిధుల కోసం ఆలయ నిర్మాణాలను ఇబ్బడి ముబ్బడిగా అక్రమార్కులు తవ్వకాలు చేసి మరింత శిథిలం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలిన ఆలయాలను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ప్రస్తుతం మనుగడలో ఉన్న కొన్ని ఆలయాలు దూపదీప నైవేద్యాలకు నోచుకోక దీనావస్థలో ఆలయాలు ఉన్నాయని అన్నారు. అదేవిధంగా ఆలయాలకు సంబంధించిన శిఖం భూములు పరాయి వ్యక్తుల స్వాధీనంలో ఉన్నాయని దీంతో ఆలయాలకు ఎలాంటి సహకారం లేకుండాపోయిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్

తాడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ నాగేశ్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఐతోల్, పాపగల్‌లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలన అంతం కావాలన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని వారి జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు మూడెకరాల భూమి, రైతులకు రుణ మాఫీ, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ నిధుల కేటాయింపు పూర్తిగా విస్మరించారన్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై ఎదురుదాడికి దిగడంతో పాటు పోలీస్ సహకారాలతో కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో లోహిత్ రెడ్డి, ఆంజనేయులు, మల్లేశ్, కిషన్, మహేశ్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

వెల్దండ: మండల పరిధిలోని రాఘయపల్లికి చెందిన రాములుకు ఆదివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యం అందించడానికి ముందుకొస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత పేదలందరికి ఫౌండేషన్ అండగా ఉండి వైద్యఖర్చుల కోసం ఆర్థికసహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, రాములు, భీముడు, చాంద్‌పాషా, రాజు, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్ చెందిన కల్వ శ్రీరాములు, కల్వ పరందాములు రైతులకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయాయి. పశుగ్రాసం పూర్తిగా కాలిపోవడంతో గ్రామానికి చెందిన తిరుగుడు రాజుయాదవ్ ఆదివారం బాధిత రైతులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. పశుగ్రాసం కొనుగోలు చేసి పశువుల ఆకలితీర్చడానికి సహాయం అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతుకు నష్టం కల్గితే సహాయం చేసేందుకు దాతలు సహకారం అందించాలన్నారు.

గిరిజన తండాలో హోలీ సంబరాలు



సిలోనిబండ తండాలో హోలీ వేడుకల్లో గిరిజనులు

వెల్దండ: మండల పరిధిలోని గిరిజన తండాలో ఆదివారం హోలీ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని సిలోనిబండతండా, అల్లంతోట బావితండాలలో గిరిజనులు సాంప్రదాయ నృత్యాలు చేస్తు వీధులల్లో ర్యాలీ నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలు ఆటపాట ఆడుతూ హోలీ చందాలను సేకరించారు. ప్రతి ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. సాంప్రదాయ పద్ధతిలో గిరిజన వేషధారణతో ఎంతో వైభవంగా నిర్వహించుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుమార్, మంగ్లి, ఎంపీటీసీ చిట్టికాడురామ్, టాక్యనాయక్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రచారం నిర్వహిస్తున్న చిన్నయ్య తదితరులు

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తుందని, ఆ సంఘం బలపరిచిన మాణిక్‌రెడ్డిని గెలిపించాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో ఇంటింటికి తిరిగి ఉపాధ్యాయులను ఓటు అడిగారు. ఈ మేరకు మాణిక్ రెడ్డి విజయం ద్వార ఉపాధ్యాయులకు కలిగే మేలును వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నయ్య, నర్సింహ, కృష్ణయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: ఎస్టీయూ అధికారిక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావును భారీ మెజార్టీతో గెలుపించుకుందామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్టీయూ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం.సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ అధికారిక అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, సురేష్ బాబు, వెంకటేశ్వర్లు, జమీల్, బాలస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

బలాన్‌పల్లిలో వైద్య శిబిరం



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో ధన్వంతరి ఫార్మసూటికల్ మెడికల్ కాలేజీ మహబూబ్‌నగర్ వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. గ్రామానికి చెందిన యాదయ్య, సర్పంచ్ అశోక్‌ల ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుస్మితతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట దుందుబీ వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వార అక్రమ రవాణా చేపట్టకుండా చూసేందుకు పోలీసులు ఆదివారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ రమేశ్ యాదవ్ సూచనల మేరకు వాగులోకి వెళ్లి ఇసుకను తరలించకుండా జేసీబీ వాహనాలతో గుంతలు తోడారు. గుంతలు తవ్వడంతో ట్రాక్టర్లు వాగులోకి వెళ్లకుండా అడ్డుకట్ట గీసినట్లయింది. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ శాఖ వార్షికోత్సవం




అచ్చంపేట రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శాఖ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జాన్‌డీర్ కంపెనీ మేనేజర్ బి. సందీప్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా నాయకులు కర్రెం నారాయణ, శ్రీరాం ఆర్య, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గేదె దూడ మృతి

వెల్దండ: మండల కేంద్రంలో వ్యవసాయ పొలం వద్ద ఉన్న గేదె దూడలపై ఆదివారం కుక్కలు దాడిచేయడంతో మృతి చెందాయి. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోర చంద్రమౌళి వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువుల షెడ్‌లో కట్టేసి ఉంచారు. పొలం వద్ద ఎవ్వరు లేని సమయంలో కుక్కలు దాడిచేయడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. కుక్కల దాడిని అరికట్టాలని కోరుతున్నారు.

ముగింపు సభను జయప్రదం చేయండి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పాలకుర్తి నుంచి పట్నం వరకు కొనసాగుతున్న పాదయాత్ర ఈనెల 28న ముగుస్తుందని, ఈ ముగింపు సభను జయప్రదం చేయాలని గ్రామపంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 12న పాలకుర్తిలో చేపట్టిన పాదయాత్ర 28న హైదరాబాద్‌కు చేరుకుంటుందన్నారు. గాంధీ పార్కు దగ్గర ముగింపు సభ నిర్వహిస్తున్నామని, జిల్లాలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొదిల రామయ్య, బిజినపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు వెలుగొండ రాములు, బొల్లెం మల్లేశ్‌గౌడ్, నాయకులు మైబూస్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'తండాల అభివృద్ధికి కృషి చేశాం'

మాజీ మంత్రి జూపల్లి



మూలమడత తండాలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: తన హయాంలోనే తండాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని నార్యనాయక్ తండా, ఎర్రన్నబావితండాలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నాగులపల్లి మెయిన్ రోడ్డు నుంచి మూలమడత తండా, ఎర్రన్నబావితండా, నార్యనాయక్ తండా, మైలారం, చిక్కెపల్లి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్ల నిధులు మంజూరు చేశానని అన్నారు. అయితే ఇప్పటి పాలకులు నాలుగేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయకుండ పబ్బం గడుపుతున్నారని అన్నారు. పాలకులు తండాలకు వచ్చినప్పుడు పనులు ఎందుకు పూర్తి చేయలేదని నిలదీయాలని సూచించారు. తన హయాంలోనే 500 జనాభా ఉన్న తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మూలమడత తండాలో బొడ్రాయి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో ఈనెల 28 మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్‌రెడ్డి యాదిరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6.03 గంటలకు ఆంజనేయస్వామికి అభిషేకం, అర్చనలు, దూపదీప నైవేద్యం, 8 గంటలకు విఘ్నేశ్వరుడి పూజతో ఉత్సవాలను ప్రారంభించి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. ఉదయం 9.31 గంటలకు పుణ్యాహవాచన, నవగ్రహ పూజ, సుదర్శన హోమం, ఉదయం 11.34 గంటలకు కల్యాణోత్సవం, పల్లకీసేవ, ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న పోలీసులు

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండలో ఆదివారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు డయల్ 100 ప్రాముఖ్యత, మద్యం తాగి వాహనాలు నడపడం, బాల్య వివాహాలు వంటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ ఖాదర్ మోహినిద్దీన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపితే జరిమానాతో పాటు కోర్టు ఆదేశాల ప్రకారం జైలు శిక్ష కూడా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బాలస్వామి, శరత్‌గౌడ్, హోంగార్డు కుమార్, గుమ్మకొండ గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు

కందనూలు: జడ్చర్లలో జరుగుతున్న ఒక్కినవా 4వ నేషనల్ ఇన్విటేషన్ల కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కటాస్ విభాగంలో విగ్నేష్, మణికంఠ, మణీదీష్, జస్వంత్, సుజన్, లక్ష్మీ ప్రసన్న, గౌతమ్‌లు గోల్డ్ మెడల్ సాధించగా, మోహన్, బ్రౌన్స్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు మెమొంటోలు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులను మాస్టర్ స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి



పోతేపల్లిలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పోతేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రతి కార్యకర్త సైనికులా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదని, ప్రతి కార్యకర్త యాత్రతో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కొండల్‌యాదవ్, ఈదన్నగౌడ్, చంద్రయ్య, రవి, గణపతి, బుచ్చయ్య, వెంకటయ్య, బాలయ్య, కృష్ణయ్య, వరుణ్, శ్రీకాంత్, మహేష్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

బీఎస్పీ యాత్రకు తరలిన నాయకులు



కుడికిల్ల నుంచి సభకు తరలుతున్న బీఎస్పీ నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండల పరిదిలోని పలు గ్రామాల నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు గద్వాల జిల్లా అలంపూర్‌లో జరగనున్న బీఎస్పీ రాజ్యాధికార యాత్ర బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో గ్రామాల నుంచి వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీ జిల్లా కమిటీ సభ్యుల ఎంపిక

నాగర్‌కర్నూల్‌రూరల్: వైఎస్సార్ టీపీ జిల్లా మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎండీ కమాల్‌పాషను ఎంపిక చేయగా కల్వకుర్తి మండల మైనార్టీ విభాగం అధ్యక్షులుగా మహెమూద్, ఖుద్దూస్, జిల్లా కార్యదర్శిగా గడ్డమీది మహేశ్, జిల్లా బీసీ విభాగం నాయకులుగా శేఖర్ ముదిరాజ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మేకల నాగరాజు యాదవ్, ప్రచార కార్యదర్శిగా అక్కి సాయిలుగౌడ్‌లు ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

చారకొండ: వైఎస్సార్‌టీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడిగా మండలంలోని జూపల్లికి చెందిన ఎండీ కమాలోద్దిన్ ఎన్నికయ్యారు. పార్టీ అధినేత షర్మిల ఆదేశాల మరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు గొని నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను మైనార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకొని నియమాక పత్రం అందజేశారు.

'ఇంటింటికీ టీడీపీ' చురుకుగా నిర్వహిస్తాం

కల్వకుర్తిరూరల్: ప్రజల కోసం ప్రగతి కోసం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నియోజకవర్గంలో చురుకుగా నిర్వహిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజుగౌడ్ చెప్పారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో మండల టీడీపీ ఇన్‌చార్జ్ మోపతయ్య, ఇతర నాయకులు కలిశారు.